

బిసిలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం

# రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/మోటకొండూర్** : రైతులు పండించిన వరి ధాన్యం సత్వరమే మిల్లులకు అందించాలనే సదుద్దేశంతో చామకూర సుగుణ శ్రీనివాస్ రెడ్డిల కుమారుడు శశిదర్ రెడ్డి సురేఖల ఆధ్వర్యంలో రైస్ మిల్లు ఏర్పాటు చేయడం శుభ పరినామం అని, ఆలేరు నియోజకవర్గంలో ఇంత పెద్ద రైస్ మిల్లు ఏర్పాటు చేయడం అభివృద్ధికి బాటలు వేయడమే నని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన ఆదివారం మోటకొండూరు మండలంలోని ఇక్కుర్తిలో అధునాతన పరికరాలతో ఏర్పాటు చేసిన నూతన రైస్ మిల్లును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లకు కాంగ్రేస్ పార్టీ అండగా ఉంటుందని, రైస్ మిల్లర్ల సమస్యలు మంత్రి ఉత్తమకుమార్ రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు మార్త వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు డివిఎన్ రెడ్డి, బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్ పాల్గొన్నారు.



**మంత్రి పర్యటన సభ ప్రాంగణం పరిశీలన**

మోటకొండూరు మండల కేంద్రంలో నేడు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా మండల పరిషత్ కార్యాలయం, సబ్ రిజిష్టార్ తహసిల్దార్ కార్యాలయాలకు శంకు స్థాపనల నిమిత్తం జరిగే ఏర్పాట్లను సభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుండి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు పర్యవేక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల**

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని తీర్మాలపురం గ్రామంలో ఆదివారం పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దత్తాయపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశానికి హాజరై లబ్ధిదారులు మార్క సంధ్య వెంకటేష్ దంపతులకు పట్టువస్త్రాలు, యాట పొట్టేలును అందచేశారు. ప్రజాప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి లబ్ది చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటి చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, నాయకులు శంకర్ నాయక్ పాల్గొన్నారు.



# రాధేయ సాహిత్య సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మాతృకవి రాధేయ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత్త ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో జరిగిన మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ, మాతృకవి రాధేయ మారక పురస్కారాల ప్రధానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లి పేరు మీద అవార్డు ఇవ్వడం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక గొప్ప స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా మాతృమూర్తి లచ్చమ్మ పురస్కారాన్ని ప్రముఖ ప్రజాకవి జయరాజుకు మాతృకవి రాధేయ పురస్కారాన్ని ప్రముఖ అష్టావధాని అవుసుల భాను ప్రకాష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య రాచమల్ల శ్యాంసుందర్, డాక్టర్ ఓగూరి నాగేశ్వరరావు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్, రావిరాల అంజయ్య, డాక్టర్ అనిత కుమారి, డాక్టర్ సాదం ఐలయ్య, డాక్టర్ గోగు వెంకటేశ్వర్లు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, రాచమల్ల శ్రీవాణి, రాధా కిషన్, రాచమల్ల చంద్రకళ, డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి, దాసరి శ్రీరాములు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజానికి గ్రీన్ వాక్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరిని చైతన్యపర్చేందుకు గ్రీన్ వాక్‌లో పాల్గొడనం ఆనందంగా ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు మారం పవిత్ర అన్నారు. ఆదివారం మిర్యాల ఉమ సహకారంతో కుడకుడలోని పిఎన్ఆర్ టౌన్‌షిప్‌లో ఇంటింటికి చేతిసంచి అందజేసి మాట్లాడారు. మును ముందు తరాలు రక్షించబడాలంటే మంచి పర్యావరణం మనందరికి అందుబాటులో ఉండాలన్నారు. మన నిర్లక్ష్యంతో ముందు తరాల మనుగడ చాలా కష్టంగా మారుతుందన్నారు. ట్రస్ట్ సభ్యులు ముప్పారపు నరేందర్, డాక్టర్ తోట కిరణ్, దేవరశెట్టి నాగరాజు, ముప్పారపు నాగేశ్వర్ రావు, గుండా కిరణ్, సోమ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ తదితర బిల్లులు, వేతనాలు, బెనిఫిట్స్ కు నిధులను వెంటనే విడుదల చేయాలని సీనియర్ ఉపాధ్యాయులు భూతం ముత్యాలు డిమాండ్ చేశారు.2023 జూన్లో కుటుంబ అవసరాల నిమిత్తం తన భార్యకు అప్పుడు పక్షవాతం మెడికల్ ఖర్చుల కోసం సరెండర్ లీవ్స్ పెట్టుకుంటే రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటికీ ఆ డబ్బులు రాలేదు అనారోగ్య సమస్యలకు ఒక ఉద్యోగిగా తాను దాచుకున్న డబ్బులు సంవత్సరాలు దాటిన రావడంలేదని అనారోగ్యాల వలన తన భార్య 2024 జనవరి నెలలో నిమ్స్ లో మరణించింది ఆమె చావులకు దాచుకున్న డబ్బులు అక్కడకు రాలేదు ఆమె మరణించి సంవత్సరం అయినా సంవత్సరీకానికి కూడా రాకపోతే ఉద్యోగాలు చేసి ఏం ప్రయోజనం చనిపోయాక వచ్చే బిల్లులు ఎవరి పాలు కావాలి బ్రతికి ఉన్నప్పుడు కళ్ళ చూడలేమా ఎందుకు పాలకులకు ఉపాధ్యాయుల మీద ఇంత వివక్ష పాలకులు ఆలోచించాలన్నారు.ఏ రాష్ట్రంలో కూడ ఇన్ని విధాల బిల్లులు పెండింగ్‌లో లేవని ముఖ్యమంత్రి ఆలోచించాలన్నారు. ఉద్యోగులకు ఏ బిల్లులు ఇప్పించలేని స్థితిలో ఇప్పుడున్న సంఘ నాయకులు ఉన్నారని విమర్శించారు. కుటుంబ వ్యక్తిగత అవసరాలు అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు బిల్లులు అందితే కుటుంబాలు కుదురుకుంటాయి.

# అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లాలి

## ముఖ్యమంత్రి చొరవ చేయాలి

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు విజ్ఞప్తి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం అఖిలపక్ష బృందాన్ని అఖిలపక్ష బిసి నాయకులను ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చేయాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మిర్యాలగూడలో బిసి భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి, సామాజి కార్యకర్తలతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిసి బిల్లు ఆమోదించి షెడ్యూల్ 9లో చేర్చాల్సిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీదేనని ఇప్పుడు ఆ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ప్రయ త్నం చేస్తున్న ప్రధానమంత్రి వద్దకు బీజేపీతో కూడిన అఖిలపక్ష బృందాన్ని సీఎం తీసుకెళ్లాలని, బిసి రిజర్వేషన్ పట్ల బీజేపీ వైఖరి ఏంటో ప్రధానమంత్రి అఖిలపక్షాల ముందు స్పష్టం చేస్తే ఆ విషయాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న బిసిలకు తెలియచేయడానికి అవకాశం లభిస్తుందని బిసి రిజర్వేషన్ల పట్ల ప్రధాని ఏవిధంగా స్పందించారో రాష్ట్ర బీజేపీ నాయకులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన అఖిలపక్ష పార్టీలు అఖిలపక్ష బిసి సంఘాలకు స్పష్టంగా అర్థమవుతుందని తద్వారా బిసిలే బీజేపీ పట్ల ఎలా వ్యవహరించాలో నిర్వహించుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. బిసిల వరకు బిసిల పట్ల అసలు ముద్దాయి బీజేపయే అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రచారం జరగాలని ఇప్పటికే బీసీలు బీజేపీని అసహ్యించుకుంటున్నారని ఈనెల 18న జరిగిన బంద్‌లో బీజేపీ పాల్గొనడం హాస్యాస్పదమని ప్రతి బీసీ నాయకులు అభిప్రాయపడుతున్నారని, ఈ ఉద్యమాన్ని మరింత ముందుగా తీసుకెళ్లి 2028 నాటికి బీజేపీని నామరూపం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి బీసీలపై ఉందని ధనుంజయనాయుడు పేర్కొన్నారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ జాడి రాజు, నరేందర్, సతీష్, ఉపేందర్‌లు ఉన్నారు.



## వాడపల్లి వద్దకు పాదయాత్ర

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శ్రీధర్మశాస్త్ర పీఠం ఆధ్వర్యంలో స్థానిక మిర్యాలగూడ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప స్వాములు భక్తబృందం వాడపల్లి శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి వద్దకు సనాతన ధర్మ పరిరక్షణ సంకల్పంతో ఆదివారం పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రముఖ వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ కేవలం దేవుని మీద భక్తి మాత్రమే కాకుండా ధర్మం కోసం దేశం కోసం పాటుపడాలని, ధర్మమే దైవమని, దేశం, ధర్మం బాగుంటేనే మనం బాగుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శి కొంగరి వెంకటనారాయణ, శివాజీ హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని హైమావతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అంబాల గ్రామానికి చెందిన ప్రముఖ కల్లు గీత కార్మికుడు లోడె లక్ష్మి వెంకటయ్య గౌడ్ కుమారుడు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు లోడె ప్రవీణ్ గౌడ్ సోనియాల వివాహ మహోత్సవ కార్యక్రమానికి అంబాల మాజీ ఎంపిటిసి పొన్నగాని మహేష్‌గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ బిఆర్ఎస్ యువజన సెక్రటరీ కందుకూరి చందు, మండల నాయకులు మహేష్ తదితరులు ఉన్నారు.

## చిన్నారులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండల కేంద్రంలోని శీలా అనసూయ గార్డెన్‌లో ఆదివారం బిజెపి నాయకులు తీరందాసు శ్రీను సుధా ల చిన్నారులు తేజస్విని ,శ్రీకాంత్‌ల నూతన పట్టు వస్త్రఅలంకరణ మహోత్సవ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో బిజెపి మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు , నాయకులు కోమటి వీరేశం , భవనం మధుసుధన్‌రెడ్డి, భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, రావిరాల శ్రీను, తిరందాసు దామోదర్, కోమటి ఓంకారం, మంచుకొండ సాగర్ , దుస్స గణేష్ ,నరాల ఆంజనేయులు , మల్లెకేడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరు నెలల్లో రాజ్‌గోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చటం కాయం

**మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప కుమార్**



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గత ప్రభుత్వాల్లో ఒక కుటుంబానికి చెందిన కొద్ది మంది లక్షల కోట్ల దేవిడీకి పాల్పడితే, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఊరికి ఐదుగురు దోపిడీదారులు తయారయ్యారు..ఇప్పుడు యువత మేలుకొని, రాజ్యాధికారం చేజిక్కించుకోకపోతే, పోరాడి సాధించిన తెలంగాణ మళ్ళీ ఇతరుల చేతుల్లోనే ఉండిపోతుంది తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ లోక్ దళ అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప కుమార్ అని పిలుపునిచ్చారు.దిలీప కుమార్ చేపటిన సామాజిక చైతన్య రథయాత్ర ఆదివారం నల్లగొండ పట్టణంకు చేరుకుంది.ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి రాహుల్ గాంధీ స్వయంగా ఆహ్వానించి మంత్రి పదవి ఇస్తానని చెప్పి,వెన్నుపోటు పొడిచారు అన్నారు. క్లాక్ టవర్ సాక్షిగా చెపుతున్న కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చటం కాయం అన్నారు.స్వాతంత్యతం వచ్చినప్పటి నుంచి తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఎస్‌సి,ఎస్‌టి,బిసి, వర్గాలకు అసలైన రాజ్యాధికారం దక్కలేదు అన్నారు. ఈ వర్గాలను విడదీసి ఓ ట్లు దండుకున్న అన్ని రాజకీయ పార్టీలు కూడా ఈ వర్గాలను వంచించాయని పేర్కొన్నారు.ఇప్పుడు ఐక్యత ద్వారానే అగ్రవర్ణాల ఆధిపత్యానికి చెక్ పెట్ట డం సాధ్యమని తెలిపారు. అమరుల ఆత్మబలిదానాల పునాదులపై సకల జనుల పోరాటంతో తెలంగాణ సాదించినా గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత ప్రభు త్వం లక్ష్యంగా పరిపాలన చేస్తున్నాయని విమర్శించారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981/82 సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థిని, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా బాల్యంలో ఒకచోట చదువుకున్న వారంతా నాలుగున్నర దశాబ్దాల అనంతరం ఒకే చోట కలుసుకునే కార్యక్రమం నాడు తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలు మామిటి చెట్లు, చింతచెట్లు ఎక్కి కాయలు కోయడం చిలిపిచేష్టలను ప్రశ్నించిన ఉపాధ్యాయులు తమ చిలిపి చేష్టలను ప్రశ్నించిన తీరు సవరించిన మార్గం అన్ని విషయాలను బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ అదనపు కార్యదర్శి పదవి విరమణ చేసిన మాధవరం నరేందర్‌రావుతో పాటు ఆర్గనైజర్లు శ్రీనివాసులు, శ్రీనివాస్, నగేష్, మధుసూధనచారి, లక్ష్మీనర్సింహా, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాములు, ఏసోబు, తిరుపతయ్య, రాజేశ్వరి, అరుణమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కార్యక్రమం ఏర్పాటులో కీలక భూమిక వహించిన మాధవరం నరేందర్‌రావును పదవీ విరమణ పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి గుర్తింపుగా మోమెంటోలు బహుకరించారు. దాదాపు 35 మంది పాల్గొన్నారు.

# మోటకొండూరులో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం ఎవరికోసం?

### ప్రజల సౌకర్యం కోసమా, అసౌకర్యానికా!

**ప్రజాపక్షం/మోటకొండూరు :** ప్రజలకు, అధికారులకు పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన మోటకొండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు కన్పించడంలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జిల్లా కేంద్రాలలో కూడ సమీకృత కార్యాలయాల సముదాయంగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకే చోట నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నప్పటికీ మోటకొండూరు మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఒకచోట, సబ్ రిజిష్టార్ తహసిల్దార్ కార్యాలయం మరోకచోట గ్రామానికి వెలుపల 1,2 కిలోమీటర్ల దూరంలో నిర్మాణం చేపట్టడంపై సర్వత్ర విమర్శలకు తావుతీస్తుంది, మండల పరిషత్ కార్యాలయం సర్వే నెంబర్ 305లో ఎకరం కేటాయించడం, సర్వే నెంబర్ 950 లో 0.20గుంటల భూమి తహసిల్దార్ కార్యాలయాకి కేటాయించడం న్యాయ బద్ధంగా లేదని మోటకొండూరు మండల సిపిఐ కార్యదర్శి గాదగాని మాణిక్యం ఆరోపించారు. మండల కేంద్రానికి 1,2 2కిలోమీటర్ల దూరంలో కార్యాలయాలు నిర్మాణం చేపట్టడంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. ఇకనైన ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే చోరవ చూపి ఒకే చోట తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు పోలీసు స్టేషన్‌ల నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మాణిక్యం కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం మండల విలేఖరి బేతాళ శ్రీనివాస్ కుమారుడు విక్రాంత్, కావ్య వివాహానికి మంత్రి సీతక్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమెతో పాటు మాజీమంత్రి మోత్కుపల్లి నరసింహులు, బూడిద బిక్షమయ్య గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, సుధా గాని హరి శంకర్ గౌడ్, మండల నాయకులు జిల్లా నాయకులు పలువురు ప్రముఖులు పాల్గొని ఆశీర్వదించారు.



## హత్యా రాజకీయాలకు దూరం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** పదేండ్ల కాలంలో తుంగతుర్తి నియోజకవర్గం హత్యా రాజకీయాలకు దూరంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఉంచిన ఆయనపై ఆరోపణలు చేయడం తగదని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ మొరిశెట్టి ఉపేందర్ అన్నారు. నియోజక వర్గానికి గోదావరి జలాలను పది సంవత్సరాలు నిరాటంకంగా తీసుకుని వచ్చి ప్రతి పంటకు సాగునీరు అందించడానికి చేసిన కృషిని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. గోదావరి జలాలతో నియోజక వర్గాన్ని ఆకుపచ్చని నియోజక వర్గంగా చేశారన్నారు. ఉన్నత విద్యావంతుడు కావడంతో ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి నియోజక వర్గ అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకురావడానికి కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొప్పుల సోమిరెడ్డి, పున్న హరిప్రసాద్, కుంభం ఉషారాణి నాగరాజు, పెద్ది శ్రీనివాస్, కోటమర్తి మల్లయ్య, నిమ్మల యాదయ్య, బొమ్మెరబోయిన వెంకన్న, లొడంగి నాగరాజు, కుంభం నాగరాజు పాల్గొన్నారు.

## ఆవగింజంత పోస్టులకు ఏనుగంత ప్రచారం

**ప్రజాపక్షం/కోదాడ:** మెగా జాబ్‌మేళా పేరుతో ఆవగింత ప్రైవేటు పోస్టులకు మంత్రి ఉత్తమ్ ఏనుగు అంత ప్రచారం ఆర్బటం చేశారని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజులలలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిన వారు బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయంలో ఉద్యోగాలు సాధించిన ఉధ్యోగులకు నియామక ప్రతాలు ఇస్తు తామే ఇచ్చిన్నట్లు బిల్డప్ ఇస్తున్నారని నిరుధ్యోగులు, రాష్ట్ర ప్రజలు గమనిస్తారిని హెచ్చరించారు. ప్రైవేటు సంస్థల ఉద్యోగాలకు ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించిన విస్తృత ప్రచారం పార్టీ కార్యకర్తలను మించి పోయిందన్నారు. కేవలం నిరుధ్యోగుల దృష్టి మరల్చేందుకు మాత్రమే ఈ జాబ్ మేళ అని దీనితో ఓరిగింది ఏమిలేదన్నారు. తప్పుడు ప్రచారలను గమనిస్తున్న ప్రజలు, నిరుధ్యోగులు తగిన సమయంలో కాంగ్రెస్ గుణపాఠం చెప్పాలని కోరారు.

## గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రాము

**ప్రజాపక్షం/ రామన్నపేట:** తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన నకిరేకంటి రాము, రాష్ట్ర కమిటీ మెంబర్‌గా బందెల భిక్షంలు ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా మహబూబ్‌నగర్ జిల్లా గార్ల మండలంలో జరిగిన గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి హాజరైన ప్రతినిధి బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం నకిరేకంటి రాము జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, సంక్షేమ ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## కోరిన కోరికలు తీర్చే తల్లి పెద్దమ్మ తల్లి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కోరిన కోరికలు తీర్చే తల్లి పెద్దమ్మ తల్లి దీవెనలు ప్రతి ఒక్కరికి పై ఉండాలని బిజెపి నాయకులు పిల్లి రామ రాజు యాదవ్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లగూడ పెద్దబండ ప్రాంతం లో ముదిరాజ్ సోదరులు నిర్మిస్తున్నా పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణంలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసి న గుడి ధర్వజ ప్రతిస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే పెద్దమ్మ తల్లి కృపా అందరిపై ఉండాలని అన్నారు. గుడి నిర్మాణానికి నా వంతుగా సహాయ సహకారాలు అందించానని తెలిపారు. ఈ గుడి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు,కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు ,స్థానిక భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్తీక దీపోత్సవం






**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ శివారులోని శ్రీసూర్యనారాయణ స్వామి క్షేత్రంలో కార్తీక మాస మొదటి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుండే అభిషేకాలు, అర్చనలలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సౌర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకులు కాకులారపు రజిత జనార్థన్, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, అంకిత్‌పాండే, శ్రీరామ్ పాండే, భక్తులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్‌లోని సురమంబ సమేత శ్రీకంఠమహేశ్వర స్వామి ఆలయంలో జైగౌడ ఉద్యమం జిల్లా కమిటి ఉపాధ్యక్షులు కేశగాని నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాలతో పొంగలి చేసి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పలువురు గౌడ కుల పెద్దలు మాట్లాడుతూ కంఠమహేశ్వర స్వామి వారి విశిష్టత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల పెద్దలు తండు ఉపేందర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, సోమగాని భాస్కర్ గౌడ్, బెల్లంకొండ రామచంద్ర గౌడ్, దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వల్లపుదాసు కృష్ణ గౌడ్, నరసింహా గౌడ్, హరీష్ గౌడ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి చారిత్రాత్మక శివాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ జాయింట్ సెక్రటరీ డిఎస్‌వి శర్మ ఆదివారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఎరకేశ్వర, నామేశ్వర స్వామి దేవాలయా ల్లో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

## పలు శుభకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన ఇప్పలపల్లి స్వామి కుమారుడు పెళ్లి రిసెప్షన్‌కు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా ఉత్తటూరు గ్రామానికి చెందిన కోళ్ల కిషన్ కుమార్తె ఎంగేజ్‌మెంట్‌కు హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే గ్రామానికి చెందిన జంగిలి నరసింహా కుమారుడు పెళ్లి రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, జిల్లా నాయకులు కన్నెబోయినత బలరాం, నాయకులు కోళ్ల స్వామి, నాంపల్లి లింగయ్య, జెట్టి సైదులు, ఆవనిగంటి నరసింహా, ఆవుల శ్రీధర్, బొలుగుల కృష్ణ, నల్ల రాజు, పొనుగోటి శ్రీనివాసరావు, లక్ష్మణ్, లింగస్వామి, నరేష్ పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవాలకు భారీగా తరలిరండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలకు నియోజకవర్గంలో భారీగా తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్ అన్నారు. ఆదివారం ఇల్లందు మండలంలోని 21 ఏరియాలో గడప గడపకు సిపిఐ కార్యక్రమంలో ప్రచారాన్ని విస్తృతం చేసి, విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ పేద గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, ప్రజా సమస్యల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభకు మండలం నుండి భారీ సంఖ్యలో ప్రజలు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బంధం నాగయ్య, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాస్, గుడిపల్లి భాస్కర్, మంచాల వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ, వడ్ల శ్రీను, బసిపాక రవి, రాందాస్, తాండ్ర లక్ష్మీనారాయణ, ఆలెం రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

## నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం

**ప్రజాపక్షం/దేవరకొండ;** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్ధి నవీన్ యాదవ్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మైనంపల్లి మాజీ ఎంపిటిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొర్ర గౌతమి రాంసింగ్‌నాయక్ తదితరులు ఉన్నారు.



## నూతన విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతనంగా పిఎంశ్రీ స్కూల్స్ ఏర్పాటు చేయడం ద్వారా నూతన విద్యా విధానం పేరుతో పసిపిల్లల మెదళ్లలో మతతత్వ బీజాలు నాటే ప్రయత్నం చేస్తుందని వెంటనే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 2022 23 నుండి 2026/27 వరకు ఐదేండ్ల కాలంలో దేశ వ్యాప్తంగా పిఎంశ్రీ సుమారుగా 14,500 పాఠశాలలను నెలకొల్పాలని, ప్రాథమిక విద్య నూతన విద్యా విధానం ద్వారా మతతత్వ బోధనలు చేయాలని తలపెట్టిందని ఇది అభివృద్ధి నిరోధక విధానమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మండలానికి పిఎంశ్రీ పాఠశాల ఏర్పాటు చేయడానికి పూనుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై పునరాలోచన చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా విద్యావేత్తలు, ప్రగతిశీల మేధావులు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం సరైంది కాదని చాలా కాలంగా నిరసనలు చేస్తున్నారన్నారు.

## నాగదేవత రేణుక ఎల్లమ్మ తల్లి ప్రతిష్ఠాపన మహోత్సవం

**ప్రజాపక్షం/చండూరుః** నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో నూనంగా నిర్మించిన నాగదేవత రేనుక ఎల్లమ్మ దేవాలయం ప్రతిష్టాపన మహోత్సవాలు ఈ నెల 26,27,28,29,30 తేదీలలో అంగరంగ వైభోవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ప్రతిష్టామూర్తుల గ్రామ ఊరేగింపు మొదలుకొని 29బుధవారం రోజున ఎల్లమ్మ యంత్ర మూల మూర్తి ప్రతిష్టా ప్రాణప్రతిష్ట తో పాటు జమదగ్ని సమేత రేణుక ఎల్లమ్మ శాంతి కళ్యాణము నిర్వహించడం జరుగుతుందని అన్నారు.చివరిరోజు గురువారం గ్రామ ప్రజలచే అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుతుందని ఆలయ నిర్వహకులు నిఖిల్ , ఇడికూడ రవి,మేకల ప్రవీణ్ తెలిపారు. ప్రతి రోజు భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అశీస్సులు పొందాలని కోరారు.

## నేడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ బీర్ల ఐలయ్య పర్యటన

**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూరు మండల కేంద్రంలో నేడు తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయాల శంకుస్థాపనలు మరియు బారీ బహిరంగ సభల కోసం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు వస్తున్నారని మండల ప్రజలు, కాంగ్రేస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మోటకొండూరు మండల కాంగ్రేస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాస్కరుని రఘునాథరాజు ఒక ప్రకటనలో కోరారు. నేడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడత 320 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

## వెండి గిన్నె బహుకరణ



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలోని శ్రీయోగానంద లక్ష్మీనృసింహ స్వామి వారికి అర్వపల్లిలోని గోపాలపురంకు చెందిన దివంగత కానిస్టేబుల్ దావుల పెద్ద వీరప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన భార్య దావుల శ్రీలత ఆదివారం రూ.12వేల విలువ చేసి వెండి తీర్థం గిన్నెను దేవాలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ మాజీ కోఆప్షన్ సభ్యులు దావుల గోపాల్, దావుల లిం గయ్య, మల్లికార్జున్, నవీన్, సోమయ్య పాల్గొన్నారు.

## కృష్ణగౌడ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూరు మండల కల్లు గీత కార్మిక సంఘం నూతన అధ్యక్షులుగా కొల కృష్ణ గౌడ్ ఇటీవల ఎన్నికైన సందర్బంగా అమ్మనబోలు గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద గౌడ్ బబ్బురి సత్యనారాయణ, సింగిల్ విండో బీస కృష్ణంరాజు, ఆలేటి నరసింహులు, బీస బిక్షపతి, బిస నరహరి, మాటూరు శంకరయ్య, నల్లమాస సత్యనారాయణ, ఉప్పునుంతల పాండు, బీస నరహరి, నల్లమాస చంద్రమౌళి కోల బాలరాజు, కోల నరసింహులు పాల్గొన్నారు.

# లకారం ట్యాంక్ బండ్‌ను సందర్శించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లకారం ట్యాంక్ బండ్‌ను ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ సందర్శించారు. ఆదివారం ఉదయం లకారం ట్యాంక్‌బండ్‌ను మేయర్ పునుకొల్లు నీరజ సందర్శించారు. అక్కడి వాకర్స్‌తో మేయర్ ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్ దెబ్బతినడం, లైటింగ్ సరిగ్గా లేకపోవడం, డ్రైనేజీ వంటి సమస్యలను మేయర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లకారం ట్యాంక్‌బండ్‌కు ప్రతి రోజు వందలాది మంది వాకర్స్, జాగింగ్ ప్రియులు వస్తున్నారని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. లైటింగ్ సదుపాయంతో పాటు పబ్లిక్ టాయిలెట్ సదుపాయాలు కల్పించాలన్నారు. పారిశుధ్య పనులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**-ఎకరాకు రూ. 30వేలు పరిహారం ఇవ్వాలి**
**-సిపిఐ జిల్లా నాయకులు చింతల రమేష్ డిమాండ్**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా నాయకులు చింతల రమేష్ డిమాండ్ చేశారు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలన్నారు. మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో సిపిఐ బృందం అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిసిఐ పత్తి కొనుగోలులో తీసుకు వచ్చిన మార్పుల మూలంగా జిన్నింగ్ మిల్లుల యజమానులు కూడా సిసిఐ సెంటర్లకు అవకాశం ఇవ్వటం లేదని రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. తేమ శాతం ఎనిమిది ఉంటేనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.8,110 మద్దతు ధర రైతులకు చెల్లిస్తామనే నిబంధనలు సడలించాలన్నారు. ఎనిమిది నుంచి 12 శాతం ఉండాలనే నిబంధనను 12 నుంచి 15 శాతంకు మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. కిసాన్ కపాస్ యాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలనే నిబంధన, స్మార్ట్‌ఫోన్లు వినియోగించలేని రైతుల దగ్గర పత్తి కొనుగోలు నిరాకరించడమే అవుతుందన్నారు. అధిక వర్షాలతో ఈ ఏడాది పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లకు పత్తి దిగుబడి లేదన్నారు. పండిన కొద్దిపాటి పత్తిని కూడా దళారులు ఆరువేల లోపే కొనుగోలు చేస్తున్నారని దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు రూ. 30వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి గాడిచర్ల సత్యనారాయణ, గ్రామ నాయకులు రాచర్ల లక్ష్మినారాయణ, కాళంగి చిన్నపిచ్చయ్య, అల్లు పెద్దరెడ్డి, గాడిచర్ల నాగేశ్వరరావు, ఉప్పయ్య, పావురాల వెంకటేష్, తోట రఘుపతిరావు, పరిమిశెట్టి కృష్ణయ్య, పావురాల రాముడు, మల్లెంపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



**-గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి**
**-కట్టా కృష్ణార్జున్‌రావు**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వైరా పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రవి అధ్యక్షతన స్థానిక శ్రీనికేతన్ స్కూల్ ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుల ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పార్టీ కార్యకర్తలు , నాయకులు పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. ముఖ్యంగా సమస్యలపై పరిష్కరించేంత వరకు పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ ఒక పెద్ద సముద్రం లాంటిదని ఎప్పటికి పార్టీ అంతరించిపోయిందని ఎవరో కలలు కంటూ పార్టీ పట్ల మాట్లాడే మాటలు వారి నైతిక విలువకలకే వదిలేస్తున్నామని వైరా మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ బలంగానే ఉందని, ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. మనందరి ఎజెండా బిఆర్ఎస్ పార్టీ గెలుపు ధ్యేయ ంగా మన నాయకుడు కెసిఆర్ నాయకత్వంలో మళ్లీ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో కావడం సాధ్యమని అన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని మాగంటి సునీత విజయాన్ని ఎవరు ఆపలేరని అన్నారు. అనంతరం పార్టీ వ్యవహారాలపై అందరూ కలిసి చర్చించుకున్నారు. భవిష్యత్తు కార్యచరణ ఏ విధంగా ఉండాలి, సమస్యలపై ఉద్యమం ఏ విధంగా చేయాలనే దానిపై సమాలోచన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, జిల్లా వర్తక సంఘం అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ సీనియర్ నాయకులు వనమా విశ్వేశ్వరరావు, మాజీ కౌఇన్సిలర్ దారెల్లి పవిత్రకుమారి, మాదినేని దుర్గాప్రసాద్, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, నూకల వాసు, తన్నీరు నాగేశ్వరరావు, మోటపోతుల సురేష్, అప్పం సురేష్, ఆదూరి ప్రేమ్‌కుమార్, మిట్టపల్లి సత్యంబాబు, బత్తుల లింగారావు, కారుకొండ బోస్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సంక్షేమ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యూ కారేపల్లి మండల కార్యదర్శి సంజయ్ అన్నారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలోని పిడిఎస్‌యు మండల కమిటీ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ హాస్టల్‌లో పిడిఎస్‌యు బృందం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు కావస్తున్న సంక్షేమ హాస్టల్స్‌లో సరిగా వసతులు లేక సొంత బిల్డింగులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి డేట్ బిల్లులు పడక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిపులు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా ఉన్న పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉందని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తులను భర్తీ చేయాలన్నారు. ఇప్పటికైఆన రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలలో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పిడిఎస్‌యు ఉద్యమాలు కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు లోకేష్, జీవన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ నెల 31 న నిర్వహించనున్న రక్తదాన శిభిరం ను విజయవంతం చేయాలని నేలకొండపల్లి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ యండీ.ఖాసిం కోరారు. మండలం లోని కోరట్లగూడెం లో ఆదివారం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...అమరువీరులైన పోలీసులను స్మరించుకుంటూ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులతో పాటు వివిధ వ్యాధులతో భాదపడే వారికి రక్తం చాలా అవసరం అన్నారు. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని సూచించారు. యువత చెడు అలవాట్ల కు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలో పాల్గొని ఆదర్శంగా నిలవాలని సూచించారు. రక్తదాన శిభిరం పాల్గొని సామాజిక బాధ్యత ను నెరవేర్చాలని సూచించారు. ప్రతీ గ్రామం నుంచి పెద్ధ సంఖ్యలో తరలిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ధలు బచ్చలకూరి నాగరాజు, పాషా, సైదా తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రీ కళాశాల విద్యార్థుల శ్రమదానం




**ప్రజాపక్షం/చింతకాని :** శీతాకాల ఎన్‌ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఖమ్మం గాయత్రి కళాశాల విద్యార్ధులు రాఘవాపురం గ్రామంలో రెండో రోజు ఆదివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. చెరువు కట్టపై ఉన్న చెత్తను తొలగించడంతో పాటు వీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రామంలోని వీధులను శుభ్రంచేశారు. విద్యార్థులు గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ జయప్రద,అధ్యాపకులు, విద్యార్ధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ చట్టం రక్షణ కోసం పోరాటాలే మార్గం



**ప్రజాపక్షం/చింతకాని :** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పరిరక్షణ కోసం పోరాటాలే మార్గమని వ్యకాస ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలపరిధి లోని నాగులవంచ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ మహాసభ వత్సవాయి జానకిరాములు, బంధం రాజ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పొన్నం మాట్లాడుతూ యూపీఏ వన్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు.బీజేపీ అనుసరిస్తున్న కూలీల వ్యతిరేక విధనాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.అనంతరం మధిర డివిజన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బంధం శ్రీనివాసరావు, పాపినేని రామనర్సయ్య, ఉపాధ్యక్షులుగా వత్సవాయి జానకిరాములు, బంధం రాజ్యం తో పాటు మరో 26 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారయణ, ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీనివాసరావు, రైతుసంఘం జిల్లా నాయకులు మడిపల్లి గోపాలరావు, సీపీఎం చితంకాని మండల కార్యదర్శి రాచబంటి రాము పాల్గొన్నారు.

# ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా జాలాది రామక్రిష్ణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డుకి చెందిన జాలాది రామక్రిష్ణను ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమించారు. రాజకీయంలో యువకుడైన రామకృష్ణ పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ పొంగులేటి వర్గంలో ప్రధాన అనుచరుడిగా ఉంటూ నమ్మిన సిద్ధాంతంతో పార్టీ కోసం పనిచేసిన జాలాది రామక్రిష్ణను ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల పలువురు కాంగ్రేస్ నాయకులు రామక్రిష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాలాది రామక్రిష్ణ మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడంతో పాటు పదవి వచ్చేందుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వైరా సిఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటప్రసాద్



**ప్రజాపక్షం/వైరా:** వైరా నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎల్లావుల వెంకటప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన వెంకటప్రసాద్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా వరంగల్ జిల్లాలో బాధ్యతలు నిర్వహించారు. అనంతరం సిఐగా పదోన్నతి పొందిన తర్వాత ఇంటిలిజెన్స్‌లో సుమారు నాలుగు సంవత్సరాల పైన ఇంటిలిజెన్స్‌లో బాధ్యతలు నిర్వహించిన వెంకటప్రసాద్ బదిలీపై వైరా సిఐగా వచ్చారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నేరుగా నన్ను కలవచ్చు అని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

# వంట కార్మికులకు తీరని అన్యాయం

**- రౌండ్ సమావేశంలో వంట కార్మికుల పోరాటానికి మద్దతు ప్రకటన**




**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వ పాఠశాలల్లో వంట పనిచేస్తున్న కార్మికులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాటి ప్రసాద్, జమలయ్యలు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో మద్యాహ్న భోజన కార్మిక సంఘం ఏఐటియుసి జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఎడారి ప్రభావతి అధ్యక్షతన ఆదివారం జిల్లా పని చేస్తున్న వంట కార్మికుల సమస్యలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళ, ప్రజా సంఘాల రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా నేతలు నరాటి ప్రసాద్, జమలయ్య, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. పద్మజ, టీచర్స్ యూనియన్ జిల్లా నాయకులు వి. వివేకా, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ పాఠశాలల్లో గత 24 సంవత్సరాలుగా పనిచేస్తూ వారి సొంత డబ్బులు పెట్టి వంటలు చేస్తూ నాణ్యమైన భోజనాలను విద్యార్థులకు అందిస్తున్న వంట కార్మికులకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు చెల్లించకుండా వంటలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మెనూ చార్జీలు ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలకు వ్యత్యాసం చాలా ఉందన్నారు. దీనితో విద్యార్థులకు సరైన భోజనం అందించలేకపోతున్నారని అన్నారు. కార్మికులకు చెల్లించే అతి తక్కువ వేతనం అయిన నెలకు కేవలం 3000/ల రూపాయల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 600 మాత్రమే చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే వేతనాలను కూడా పెండింగ్ పెట్టారని ఆరోపించారు. దీనితో వంట కార్మికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. గత కొద్ది రోజుల నుండి మెనూ ప్రకారం ఖచ్చితంగా ఆహారం అందించాలని, ఒకే కర్రీకి డబ్బులు చెల్లిస్తూ రెండు రకాల కూరం వండాలనటం గుడ్డుకు ఆరు రూపాయలు చెల్లిస్తే మార్కెట్‌లో ఎనమిది రూపాయలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ఇంత తేడాతో వారానికి మూడుసార్లు కోడి గుడ్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.ఇదేకాక పాఠశాలల్లో డ్వాక్రా గ్రూపుల పేరుతోని, అలాగే కొందరు ప్రధానోపాద్యాయులు కూడా వండితే వండిపెట్టండి లేకుంటే మానేయండి అంటూ కార్మికులను మానసిక వేదనకు గురిచేయటం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 10 వేయిల వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే వంట సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. లేదా ప్రతీ విద్యార్థికి 25 రూపాయల మెనూ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాద్యాయులు, డ్వాక్రా సంఘం గ్రూపుల సభ్యులు, ఇతరత్రా ప్రజా సంఘాల నాయకులు, వంట కార్మికుల పై ఒత్తిడి చేయకుండా సహకరించాలని పిలుపునిచ్చారు. వంట కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు మేమంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ మద్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ దాసుల పుష్పావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండూరి ప్రభావతి, రైతు సంఘం జిల్లా నాయకులు జర్పుల మోహన్, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు అల్లి వెంకటేశ్వర్లు, వంట కార్మిక సంఘం జిల్లా నాయకులు ధనలక్ష్మి, శారద, లక్ష్మి, రమాదేవి, లలిత, లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి


**-సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు రావులపల్లి రవికుమార్**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభకు ప్రతి ఒక్క కార్యకర్త కదలి రావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమారు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 దేశాల ప్రతినిదులు,5లక్షలమందితో ఈ సభ అత్యంత వైభవంగాముగింపు ఉత్సవాలను జరుపుకుంటుందని ఆయన తెలిపారు.అనంతరం మండలంలోని పలుగ్రామాలల్లో బహిరంగ సభ జయప్రదం చేయాలని ప్రచార కర పత్రాలను ఇంటింట పంచారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సిపిఐ100ఏళ్ల ప్రస్థానంలో అనేక ఉద్యమాలు,పోరాటాలు నిర్వహించిన ఘనత ఉందన్నారు. తెలంగాణ సాయుద పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర భారత కమ్యూనిస్టుపార్టీదన్నారు.దున్నేవానికే భూమి అనేనినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి పేదవానికి భూములు పంచిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు.అధికారం ఉన్నాలేకున్నానిరంతరం ప్రజల పక్షాననిలబడి వారిహక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసిందన్నారు.అంతటి చరిత్ర100ఏళ్లుగా నేటికి ప్రజల హృదయాల్లో పధిలంగా ఉందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సిపిఐ శ్రేణులు,పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి బొల్లోజు వేణు,సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, నోములు రాంరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, కురసం ప్రసాద్, కాటిబోయిన వెంకటేశ్వర్లు, రాచకొండ సురేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓ వైపు పోలీసుల తనిఖీలు..మరో వైపు అక్రమ ఇసుక రవాణా..!





**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ మండల వ్యాప్తంగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు. పోలీసులు తనిఖీలు చేస్తున్నా భయం బెదురు లేకుండా అర్ధరాత్రి ఇసుక రవాణా చేస్తున్నారు. మండల పరిధి రంగాపురం గ్రామంలో డిఎస్‌పి సతీష్ కుమార్ నేతృత్వంలో పాల్వంచ పోలీసులు శనివారం అర్ధరాత్రి వాహన తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు అదే గ్రామంలోని కిన్నెరసాని నది నుండి కొందరు వ్యక్తులు నాగారం మీదుగా ట్రాక్టర్‌లతో ఇసుక అక్రమంగా పెద్దమ్మతల్లి గుడి మీదుగా ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. నాగారం, మోరంపల్లి బంజర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు కలిసి నాగారం సీతారామ ప్రాజెక్టు కెనాల్ సమీపంలో కిన్నెరసాని వాగు నుండి అర్ధరాత్రి పదుల సంఖ్యలో టిప్పర్‌లకు ఇసుక లోడ్ చేసి కెనాల్ నుండి బిసిఎం ప్రధాన రహదారి పాల్వంచ, పాల్వంచ మీదుగా కొత్తగూడెం, ఖమ్మం పట్టణాలకు తరలిస్తున్నారని శనివారం అర్ధరాత్రి సామాజిక మాద్యమాలలో చక్కర్లు కొట్టడంతో తాత్కాలికంగా అక్రమ పర్వాన్ని నిలిపివేశారని తెలుస్తోంది. దీనితో అక్రమ ఇసుక రావాణాపై పాల్వంచ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. వారిద్దరు కాక మరోకరు ఎవరైనా ట్రాక్టర్ పెడితే వారికి కప్పం కట్టాలని బెదిరింపులకు దిగుతారని ఆరోపణలు వస్తున్నాయి. లేనిచో అధికారులతో వారి వాహనాలను పట్టిస్తారని వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి. ట్రాక్టర్లతో పగలు డంప్ చేసి రాత్రి సమయంలో టిప్పర్‌ల ద్వారా రవాణాకు పాల్పడుతూ లక్షలు దోచుకొంటున్నారని అంటున్నారు. అక్రమ ఇసుక పర్వంపై అధికారులు దృష్టి సారించి చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజలకు అండగా గులాబీ జెండా



**ప్రజాపక్షం/కరకగూడెం:** బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు కరకగూడెం మండలంలోని సమాత్ మోతె(గొల్లగూడెం) గ్రామంలో గ్రామ కమిటి అధ్యక్షులు మలకం వెంకటేశ్వర్లు, కార్యకర్తలతో కలిసి గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలకం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లేనిపోని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ పార్టీ సొంతం చేసుకుంటుందని అన్నారు. ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి, సరైన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్, పార్టీ కోఆర్డినేటర్ సుతారి నాగేష్, బట్టా బిక్షపతి, ఇర్ప సత్యం, ఇర్ప నాగేష్, కుంజ లక్ష్మయ్య, అంజయ్య, పుల్లయ్య, ఆదినారయణ, రమేష్, కుమారస్వామి, వంశీ, కుషేలుడు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్‌చోర్‌ని వ్యతిరేకిస్తూ సంతకాలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తూ ప్రజాస్వేచ్ఛ, హక్కులను హరిస్తూ ఓటు లేనివారిని కూడా ఉన్నట్లుగా సృష్టించి దుష్టపరిపాలన కొనసాగిస్తున్నారని ఎంఎల్‌ఏ కోరం కనకయ్య ఆరోపించారు. ఈనేపథ్యంలో సమగ్ర ఆధారాలతో పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఓట్ చోరి బహిర్గతం చేసిన తరుణంలో ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఓట్ చోరిని వ్యతిరేకిస్తూ ప్రజలతో సంతకాలు సేకరణను ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో చేపట్టారు. ఈకార్యక్రమంలో భాగంగా పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా హాజరై వార్డుకు చెందిన మహిళా సోదరీమణులతో ఓట్ చోరి కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరించారు. ఓట్ చోరి చేసి అక్రమ మార్గంలో గద్దెనెక్కిన భాజపాకు ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు పులి సైదులు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, నాయకులు మాడుగుల సాంబమూర్తి, చిల్ల శ్రీనివాసరావు, మండల మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మల్లేల డేవిడ్, మేకల శ్యామ్, మహబూబ్, ఇమామ్, టౌన్ మహిళ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, సలీం, రామక్రిష్ణ, మల్లిశ్వరి, యాకుబ్, కమలాకర్, తుపాకుల సైదులు, నాగరాజు, శంకర్, సత్యనారాయణ, మేకల శ్రీనివాస్, పద్మ, బిల్లాకంటి పద్మ, మేకల రమేష్, ఆవునురు గణేష్, పోటు వెంకన్న, నీలకంఠం వెంకటేశ్వర్లు, సునీల్, ప్రదీప్, కొండపల్లి సంపత్, కొండూరి పద్మ, వార్డ్ నాయకులు గిరి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం వర్కర్లకు పెండింగ్ బిల్లులు జీతాలు తక్షణమే విడుదల చేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మధ్యాహ్నం భోజన వర్కర్లకి పెండింగ్ బిల్లులు జీతాలు తక్షణమే విడుదల చేయాలని సిఐటియు జిల్లా నాయకులు సత్ర పల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్న భోజనం వర్కర్ల సమావేశం శ్రామిక భవన్ లో జరిగింది. సమావేశానికి శైలజ అధ్యక్షురాలుగా వహించగా ఈ సందర్భంగా ఈ సిఐటియు జిల్లా నాయకులు సత్ర పల్లి సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్నం భోజనం వర్కర్ల సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నాయని, నెలలు గడుస్తున్నా జీతాలు, వంట బిల్లులు నేటికి పడలేదని, కార్మికులు కిరాణా షాపుల దగ్గర అప్పులు చేస్తూ. సరుకులు తీసుకొస్తూ పిల్లలకి వడ్డిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారి బిల్లులు పట్ల గాని, వారి జీతాల విషయంలో గాని స్పందించట్లేదన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు బిల్లులు విడుదల చేయాలని, వారికి వంట చేసే సమయంలో పొగ వల్ల కంటిచూపు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని, ప్రభుత్వం ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేస్తామన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు కొడిశాల రాములు మాట్లాడుతూ 40 సంవత్సరాల తర్వాత సీఐటియూ జిల్లా మహాసభలు మణుగూరు పట్టణంలో జరుగుతున్నాయని ఈ మహాసభలకు పట్టణ ప్రజలు కార్మికులు అందరూ సహకారాలు అందించాలని మహాసభలు జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మధ్యాహ్నం భోజనం వర్కర్ నాయకురాలు డి రమాదేవి. ఎం మునెమ్మ. కే సరిత. సిహెచ్ విజయ, కృష్ణవేణి, లలిత, నాగరత్నం, మనీ, చంద్రమ్మ, పుష్ప. మనీ, చంద్రమ్మ, పుష్ప, జి సీత తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

**-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు : ఎంపీ రామ సహాయం**
**-రాష్ట్రంలో ఆరు చోట్ల జాబ్ మేళాలు నిర్వహణ**
**-72 కంపెనీలు...4611 ఉద్యోగాలు**
**-హాజరైన 14,300 మంది నిరుద్యోగులు**
**-ఫలించిన ఎమ్మెల్యే దంపతుల కృషి**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా దంపతుల కృషితో, సింగరేణి, టాస్క్ వారి సౌజన్యంతో సత్తుపల్లి పట్టణంలో ఆదివారం జరిగిన మెగా జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్ అయింది. సుమారు 14,300 మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరుకాగా, 72 కంపెనీలు పాల్గొని, 4611 మంది నిరుద్యోగులను ఉద్యోగులుగా నియమించుకున్నాయి. సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపి రామసహాయం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే నిరుద్యోగుల కోసం రాష్ట్రంలో జాబ్ మేళా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. 140 కోట్ల జనాభా కలిగిన ఈ దేశంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏమైనా కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలు విడుదలైతే పోటీ ఎక్కువగా కనిపిస్తుందని, అందుకే ప్రైవేట్ కంపెనీల ఇంటర్వ్యూలకు భారీగా స్పందన కనిపిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రూరల్ ఏరియాలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. అందుకే జాబ్ మేళాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు.. సత్తుపల్లిలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించిందని ఆశాభావం వ్యక్తం చేశారు. సత్తుపల్లిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ పెద్ద పెద్ద ప్యాకేజీలు, ఇంటి దగ్గర్లోనే ఉద్యోగం అనే ఆలోచన లేకుండా లభించిన ఉద్యోగాన్ని సద్వినియోగపరుచుకోవాలని శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి కోరారు. పిల్లలు తల్లిదండ్రులకు భారం కాకూడదని విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రభావిత ఏరియా అయిన సత్తుపల్లిలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చిన ఉద్యోగంలో చేరి నైపుణ్యం చూపిస్తే ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు, కొత్తగూడెం ఏరియా మేనేజర్ శాలెంరాజు, డిప్యూటీ జీఎం కోటిరెడ్డి, కిష్టారం ప్రాజెక్టు మేనేజర్ నరసింహారావు, జీవిఆర్ ఓసి పిఓ ప్రహ్లాద్, సత్తుపల్లి ఎమ్మార్వో పున్నం సత్యనారాయణ, ఎంపీడీవో నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ నరసింహ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోటా సుజలరాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, కమల్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# పేరుకే ఫ్రెండ్లీ పోలీసింగ్..!

**-విలేకరులపై చేయి చేసుకున్న సీఐ**
**-సర్ది చెప్పిన ఏసిపి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజలతో మంచి సంబంధాలు నడుపుతూ ఫ్రెండ్లీ పోలీస్ అనే పదానికి వన్నె తెచ్చేలా వ్యవహరించాలని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డిజిపి పోలీసు వర్గాలకు పదేపదే హితబోధ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు ఒక సీఐ. ఆదివారం ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలో నిర్వహించిన జాబ్ మేళాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనపై జర్నలిస్టు సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయనే సమాచారం అందుకున్న ఏసీపీ రఘు వచ్చి సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆదివారం సత్తుపల్లిలో జాబ్ మేళా నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి, శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తదితరులు హాజరయ్యారు. సభ ముగిసిన తర్వాత స్టాల్స్ పరిశీలించేందుకు వెళుతున్న ప్రజా ప్రతినిధుల వెంట కవరేజీ కోసం జర్నలిస్టులు వెళుతుండగా గేటులో ఉన్న రూరల్ సీఐ ముత్తులింగం మొదట సాక్షి రిపోర్టర్ శ్రీనివాసరావు, తర్వాత జర్నలిస్టు సంఘ రాష్ట్ర నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ ఖాదర్ బాబాను నెట్టేశారు. జర్నలిస్టులమని చెపుతున్నప్పటికీ ఆలోచించకుండా రెండుసార్లు తోసేయడంతో తోటి జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. పరిస్థితి గమనించిన ఏసీపీ రఘు హుటాహుటిన అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆందోళన సర్దుమడిగింది. సిఐ ప్రవర్తన గమనించిన వారంతా ఫ్రెండ్లీ పోలీస్ గా ఉండాలనే డిజిపి హితబోధకు సీఐ తూట్లు పొడిచారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు డిజిపి దృష్టికి తీసుకువెళ్లిన్న జర్నలిస్టు సంఘ నాయకులు ఎస్కే ఖాదర్ బాబా తెలిపారు. ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించాలని కోరినట్లుగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహతలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు.

# దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని బీజెపి జిల్లా నాయకులు రేగా సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలం లోని వివిధ గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....ఆకాల వర్షం రైతుల కు తీరని నష్టం చేసినట్లు తెలిపారు. వరి, పత్తి, ఇతరత్రా పంటలను వానాలకు దెబ్బతిన్నట్లు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 31 న జరిగే సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జరిగే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, కళ్యానం నాగేశ్వరరావు, సయ్యద్ మోహినుద్దీన్, పిట్టల సూరిబాబు, గెల్లా నాగసాయి, కందరబోయిన గోపి, కోండా హర్ష, తేజావత్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి డిపోలో నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనల కొరకు 9959225962 కు ఫోన్ చేసి డిపో మేనేజర్ తో మాట్లాడవచ్చునని అన్నారు. ఈ సదావకాశాన్ని సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు అందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## ఆత్మ కమిటీ చైర్మన్‌గా మట్టూరి వెంకటేశ్వరరావు

**నేడు ఆత్మ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం**



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా వైరా మండలం సిరిపురం గ్రామానికి చెందిన మట్టూరు వీరయ్య తనయుడు మట్టూరు వెంకటేశ్వరరావు నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. ఆత్మ కమిటీ చైర్మన్‌గా మట్టూరు వెంకటేశ్వరరావుతో పాటు 24 మంది డైరెక్టర్లను నియమించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సమన్యాయం చేస్తూ ఆత్మ కమిటీ డైరెక్టర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ పాలకవర్గం ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## రేపు వైరాలో మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

**-భారీ బైక్ ర్యాలీ**



**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల28వ తారీఖున తెలంగాణ రెవిన్యూ శాఖ, గృహ నిర్మాణ శాఖ, సమాచార ప్రజా సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ జన్మదిన వేడుకలకు వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ ముఖ్య అతిధిగా హాజరవుతున్నారు అని పొంగులేటి అభిమానులు తెలిపారు. ఈ జన్మదిన వేడుకల్లో కాంగ్రేస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పొంగులేటి శీనన్న అభిమానులు అందరూ పాల్గొనాలని అన్నారు. శాంతి నగర్ పరుచూరి గార్డెన్స్ నుండి మధిర రోడ్డు వరకు 28వ తారీఖున 9.30 గంటలకు జరుగు బైక్ ర్యాలీలో నిర్వహించి ఇండోర్ స్టేడియం ప్రక్కన కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డుల నుండి అలాగే మండలంలోని కాంగ్రేస్ శ్రేణులు చాలా పెద్ద ఎత్తున పాల్గొనాలని మండల కాంగ్రేస్ కమిటీ, పట్టణ కాంగ్రేస్ కమిటీ పొంగులేటి శీనన్న అభిమానులు తెలిపారు.

## మండల స్థాయి క్రీడలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన పాఠశాలలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నవంబర్ నెల 4, 5 తేదీలలో మండల స్థాయి పాఠశాలల ఆటలు పోటీలు కల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతాయని మండల విద్యాశాఖ అధికారి నివేదిత, వ్యాయామ ఉపాధ్యాయులు భీమా వీర రాఘవులు తెలిపారు. 14 సంవత్సరాలు విభాగం వారు ఒకటి ఒకటి 2022 తర్వాత జన్మించిన వారు అర్హులని, అలాగే ఒకటి ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జట్లు ఎంపిక చేయబడతాయని కావున మూడో తేదీ కల్లా అన్ని టీములు ఆయా పాఠశాలల నుంచి పేర్లు పంపించాలని వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహకులు బోడ భీమా, పసుపులేటి వీరరాఘవయ్య, రాధాకృష్ణ, పద్మ, త్రివేణి, అప్పారావులు తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

## ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందజేత



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఫోన్లు పోగుట్టుకున్న బాధితులకు వారి ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనిపెట్టి ఏఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు, సీఈఐఆర్ కానిస్టేబుల్ యండ్రాతి శ్రీనివాసరావు ద్వారా బాధితులకు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ పోగుట్టుకున్న ఫోన్లు పోలీసులు పట్టుకొని తిరిగి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.